క్లుప్తంగా

గ్రామదేవత పోలేరమ్మకు పొంగళ్లు



గ్రామదేవతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వరికుంటపాడు: మండలంలోని గొల్లపల్లె గ్రామదేవత పోలేరమ్మ తల్లికి గ్రామస్తులు ఆదివారం ఘనంగా పొంగళ్లు నైవేద్యాలుగా సమర్పించారు. మహిళలు పొంగలి సామగ్రిని కొత్త బుట్టలో పెట్టుకుని డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రదక్షిణల అనంతరం పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి తాగు, సాగునీటికి ఇబ్బందుల్లేకుండా పాడి, పంటలతో సమృద్ధిగా ఉండాలని మొక్కుకున్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల అందజేత



ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న దృశ్యం

మర్రిపాడు: మర్రిపాడులో ఆదివారం కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను, సిలిండర్లను బీజేపీ ఆత్మకూరు నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి 120 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ టీపీ క్యాలెండరు ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండరు, డైరీలను ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆ యూనియన్ ఉపాధ్యాయులు ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నేతలు ఓబుల్‌రెడ్డి, చెంచయ్య, వెంకటరెడ్డితో పాటు షేక్ గాజుల తాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, మోది రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



గంధాన్ని దర్గా వద్దకు ఊరేగింపుగా తీసుకు వస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం ముస్లిం కాలనీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సయ్యద్ ఖాదర్‌వలి ఔలియా గంధోత్సవం ఆదివారం తెల్లవారు జామున గంధ ఊరేగింపుతో ముగిసింది. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో స్థానిక కౌన్సిలర్ చెరుకూరి కామాక్షయ్యనాయుడు, శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మత పెద్దలు నూతన పాత్రలో గంధాన్ని కలిపి మేళతాళాలతో ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకు వచ్చారు. జెండాచెట్టు వద్ద ఔలియా వారికి గంధ సమర్పణ చేసి గంధ ప్రసాదాన్ని భక్తులకు పంచి పెట్టారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ

కలిగిరి: పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కలిగిరి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ పావులూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. అనంతరం కలిగిరి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

రాష్ట్రం సుభిక్షం.. ప్రజల సంక్షేమానికి

జగనన్న అహర్నిశలు కృషి

- జగనన్న పథకాలు ఎన్నెన్నో
- చంద్రబాబు పథకాలు ఒక్కటీ లేదు
- ఇచ్చిన ప్రతి హామీ జగనన్న అమలు
- టీడీపీ హామీలు నీటి మూటలు
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

కావలి: రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలని, తద్వారా ప్రజలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి అవసరమైన సంక్షేమ పథకాలు అమలు చేయడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్నిశలు కృషి చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెన్నాయపాళెంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి గడిచిన నాలుగున్నర ఏళ్లలో అర్హులకు అందజేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలందరూ బాగుండాలని సీఎం వైఎస్ జగన్ కష్టపడుతున్నారన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలను పూర్తిగా ఓటర్లుగానే చూసిందని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిందన్నారు. ప్రజలకు ఆరోగ్యం, పిల్లలకు చదువు, రైతులకు వ్యవసాయ సేవలు అందించే ఆలోచన చేసి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, సాగునీటి వనరులను అభివృద్ధి చేసిన మహానేత డాక్టర్ వైఎస్సార్ అని గుర్తు చేశారు. ఆయన తర్వాత జగనన్న సీఎంగా వచ్చి పది అడుగులు ముందుకు వేసి, ప్రజలు చేయి చాచి అడగాల్సిన పని లేకుండా, ఆఫీసులు, నాయకుల చుట్టూ తిరగకుండా, హక్కుగా భావించి పథకాలు అందిస్తూ పేదవారిని గౌరవిస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. 2019కి ముందు ఎన్ని పథకాలున్నాయి? ఇప్పుడెన్ని పథకాలు అనేది ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. ప్రజా ప్రభుత్వం, ప్రజల్ని గౌరవించే ప్రభుత్వం జగనన్నదని పేర్కొన్నారు. జగనన్నను గెలిపిస్తే అమ్మఒడి ద్వారా స్కూల్‌కు పంపితే ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పామని, ఆ హామీ నిలబెట్టుకున్నామన్నారు. జగనన్నను గెలిపిస్తే రైతు భరోసా కింద డబ్బులు వేస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకున్నట్లు తెలిపారు. డ్వాక్రా రుణాలు నాలుగు దఫాలుగా తిరిగిస్తామని చెప్పి నాలుగు విడతలు ఇచ్చారన్నారు. ఇదే జగనన్న నైజమన్నారు. గతంలో చంద్రబాబు మహిళల డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానన్నాడని, అందరూ చంద్రబాబుకు ఓటేస్తే రుణమాఫీ చేయలేదనే విషయాలన్నీ గుర్తు చేసుకోవాలన్నారు. ఈ రోజు ధైర్యంగా తాము ప్రతి గడపకూ వచ్చి మీకు జరిగిన లబ్ధి విషయాన్ని చెబుతున్నామన్నారు. 2019 మేనిఫెస్టోని పట్టుకుని హామీలన్నీ నెరవేర్చాం అని ధైర్యంగా చెబుతామని, కానీ 2014 టీడీపీ మేనిఫెస్టో పట్టుకొని వాళ్లు చెప్పగలరా? అని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సవాల్ చేశారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా చేశారని, చెప్పుకోడానికి ఏదైనా ఒక్క పథకమైనా ఉందా? అని ప్రశ్నించారు. జగనన్న పేరు చెబితే రెండు రోజులు మాట్లాడుకునే అన్ని పథకాలు గుర్తుకొస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి, కుమారుడు బాలసాకేత్ కుమార్‌రెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, ఎంపీపీ కొండమ్మ, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెట్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌లు, ఆలయాల పాలక మండలి సభ్యులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలాలు, కావలి పట్టణ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో కొత్తగా మంజూరైన వారికి పింఛను పంపిణీ చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

సంక్షేమ సారథి సీఎం జగన్

- పింఛన్ల పెంపు ఉత్సవ సభలో మేకపాటి



వింజమూరులో పింఛను అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం ప్రయత్నం గొప్ప రాజకీయ నేత, సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఉదయగిరి, వింజమూరుల్లో ఆదివారం జరిగిన పింఛను పెంపు ఉత్సవాల సభల్లో మాట్లాడారు. రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉన్నా ఎన్నికల వేళ ఇచ్చిన మాట నిలబెట్టుకునే నిమిత్తం సామాజిక పింఛన్‌ను రూ.3 వేలకు పెంచిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 99 శాతం హామీలు నెరవేర్చిన రాజకీయ నేత దేశంలో ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. జగన్ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. టీడీపీ పాలనలో చంద్రబాబు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ బూటకపు వాగ్దానాల్లో ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు మంచి, చెడు గమనించి నిర్ణయం తీసుకోవాలన్నారు. వైఎస్సార్ చేయూత, నేతన్న హస్తం, రజకులు, దర్జీలకు, నాయీ బ్రాహ్మణులకు, విద్యార్థులకు ప్రయోజనం కల్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎల్లో మీడియా, పచ్చ గ్యాంగ్ అనేక కుట్రలు పన్ని అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. మళ్లీ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరోసారి సీఎంగా జగన్‌ను చేసుకోవాల్సిన అవసరముందన్నారు. అనంతరం అర్హులైన కొత్త వారికి మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీలు మోది రామాంజనేయులు, గణపం బాలకృష్ణారెడ్డి, మండల కన్వీనర్లు జి.ఓబుల్‌రెడ్డి, రేవునూరు శ్రీనివాసులురెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు షేక్ గాజుల తాజుద్దీన్, ఎంపీడీఓలు ఈశ్వరమ్మ, రాజేష్‌బాబు, మండల అధ్యక్షుడు ఇనగలూరి మోహన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి, స్థానిక నేతలు చేజర్ల సుబ్బారెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్దాని, గొల్లపల్లి తిరుపతి, అక్కి భాస్కర్‌రెడ్డి, గౌస్‌మొహిద్దీన్, మలిరెడ్డి విజయ్‌రెడ్డి, అనంగి రమణయ్య, సర్పంచ్ సుజన, పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

- కొత్తపాళెం వద్ద కావలి కాలువ ద్వారా సాగునీరు విడుదల చేసిన రాజగోపాల్‌రెడ్డి



కావలి కాలువపై పర్యటిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: జలదంకి మండలంలోని అన్ని చెరువులకు నీరందించడంతో పాటు కావలి కాలువ ద్వారా సాగునీరు సక్రమంగా అందేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కావలి కాలువపై పర్యటించి కొత్తపాళెం వద్ద కాలువ ద్వారా కింది ప్రాంతానికి సాగునీరు విడుదల చేయించారు. అనంతరం ఆయన సొంత నిధులతో చేపడుతున్న కావలి కాలువ పూడిక తీత పనులను పరిశీలించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జలదంకి మండలానికి సాగునీరు విడుదల చేయడం కుదరదని, నాట్లు వేసుకోవద్దని అధికారులు తెలపడంతో రైతులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాంతంలో రైతులకు వరి పంట మాత్రమే ఆధారమని వివరించడంతో ఆయన స్పందించి జలదంకి మండలానికి సాగునీరు విడుదల చేయిస్తానని తెలిపారన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సోమశిల అధికారులతో చర్చించి కావలి కాలువ ద్వారా చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు నీరు అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మండలంలో చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా తన శాయశక్తులా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, జిల్లా ప్రచార కార్యదర్శి ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, సోమవరప్పాడు మాజీ సర్పంచ్ చేవూరు శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోర్సిపాటి రామిరెడ్డి, సురె వెంకటశేషారెడ్డి, బోడిమండ్ల కృష్ణారెడ్డి, చేజర్ల హరిబాబురెడ్డి రైతులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

చేజర్ల: మండలంలోని నాగులవెలటూరు, ఆదూరుపల్లి గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై నాయకులు, అధికారులు ప్రజలకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో 3,992 కి.మీ. మేర జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందన్నారు. విమానయాన ప్రయాణంపై సాధారణ పౌరుల ఆకాంక్షలు నెరవేరాయని, రెండు కొత్త విమానాశ్రయాలు నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, మండల అధికారులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

పందుల దాడిలో మహిళకు గాయాలు

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలో పందులు దాడి చేయడంతో మహిళకు గాయాలైన ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు స్థానిక చర్చి సమీపంలో ఒంటరిగా వెళ్తున్న మహిళపై పందులు ఒక్కసారిగా దాడి చేశాయి. మహిళ కింద పడిపోవడంతో చేతికి, కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై పందులను తరిమేశారు. గాయపడిన మహిళను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అధికారులు స్పందించి పందుల బెడద తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

ఆత్మకూరు: పది రోజులకుపైగా సమ్మె చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె ఆదివారం కొనసాగింది. సీపీఎం, సీఐటీయూ నాయకులు వారికి మద్దతు పలికారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి పట్టణంలోని బస్టాండ్ వరకు కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని కోరారు.

వృద్ధులు, పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనుమసముద్రంపేట: సమాజంలోని వృద్ధులు, అనాథలు, పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మిద్దె వెంకటేశ్వరరావు, పద్మజ, రవి విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కావలియడవల్లిలో ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 1000 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏలూరు మాల్యాద్రినాయుడు, మన్నం మోహన్, గ్రామ సర్పంచ్ ముప్పూరి ధనమ్మ, ఏలూరు సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తిరునాళ్ల ప్రారంభం

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలో ఆదివారం నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే గ్రామదేవత పోలేరమ్మ తిరునాళ్ల ప్రారంభమైంది. మహిళలు నైవేద్యం తయారు చేసి గ్రామంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. 8, 9 తేదీల్లో పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. 11వ తేదీ గ్రామంలో పిల్లలు, పెద్దలు పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

క్రీడాకారులకు టీ షర్ట్స్, టోపీలు అందజేత



క్రీడాకారులకు టీ షర్ట్స్, టోపీలు అందజేస్తున్న ఎంపీడీఓ

మర్రిపాడు: మండలంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని 17 సచివాలయాల పరిధి నుంచి మండల స్థాయి పోటీకి ఎంపికైన క్రీడాకారులకు టీషర్ట్స్, టోపీలను ఎంపీడీఓ నాగమణి ఆదివారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు మండల స్థాయిలో జరిగే క్రీడాపోటీల్లో గెలుపొంది నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంక్రాంతి విశిష్టతకు భగవద్గీత ప్రామాణికత



బట్టేపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను భక్తులకు పంపిణీ చేస్తున్న ప్రబోధ సేవా సమితి ప్రజలు

ఆత్మకూరురూరల్: సంక్రాంతి పర్వదినాలు భోగి, మకర సంక్రాంతి పండగలు ఉత్తరాయణ పుణ్యకాలం భగవద్గీతలో ప్రవచించిన ప్రామాణికతలకు అనుకూలంగా ఉంటాయని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధకుడు పెంచల నరసయ్య అన్నారు. మండలంలోని బట్టేపాడులో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత ప్రచార కార్యక్రమంలో ఆయన పలు అంశాలను వివరించారు. అనంతరం భక్తులకు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రవచన పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇందు జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు కొండయ్య, కృష్ణయ్య, భాగ్యమ్మ, వెంకటేశ్వర్లు, శేషాద్రి, పెంచలయ్య, నరసారెడ్డి, నాగేంద్ర, పెంచలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బ్రాహ్మణక్రాక సర్పంచ్ నియామకం



ఇండ్ల సుధాకర్‌కు నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

జలదంకి: యానాది సంఘాల మహా కూటమి జిల్లా కమిటీలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బ్రాహ్మణక్రాక సర్పంచ్ ఇండ్ల సుధాకర్ నియమితులయ్యారు. ఆదివారం నెల్లూరులో జరిగిన నూతన కమిటీ సమావేశంలో యానాది సంఘాల మహా కూటమి రాష్ట్ర అధ్యక్షుడు బి. వెంకటపతి బ్రాహ్మణక్రాక సర్పంచ్ సుధాకర్‌కు నియామకపత్రం అందించారు. నూతనంగా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సుధాకర్ మాట్లాడుతూ యానాదులకు ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలు అవగాహన కల్పించడంతో పాటు వారికి ఆ పథకాలు అందేలా చూస్తానని తెలిపారు. యానాది సంఘాల మహాకూటమికి మండలంలో త్వరలో సభ్యులను నియమిస్తామని చెప్పారు.

రేపు అంబేడ్కర్ జీవిత చరిత్రపై సమావేశం

ఆత్మకూరురూరల్: ఈనెల 19న విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ సందర్భంగా ఈ నెల 9న ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర, సామాజిక న్యాయం అనే అంశంపై సమీక్ష సమావేశంలో సందేశాలు ఇస్తారన్నారు. కార్యక్రమానికి మండలంలోని ఇంజినీర్లు, డాక్టర్లు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా దాసరి ప్రసాద్



జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన ప్రసాద్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

ఆత్మకూరు: ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఆత్మకూరుకు చెందిన దాసరి దర్గా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రాష్ట్ర ట్రైబ్స్ అధ్యక్షుడు నల్లబోతుల కొండయ్య ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య మాట్లాడుతూ ఏకలవ్య కులస్తుల సమస్యల పరిష్కారం కోసం, రావాల్సిన హక్కుల సాధన కోసం జిల్లా కార్యవర్గం పట్టుదలగా పని చేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన దాసరి దర్గా ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం ప్రోత్సాహంతో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు ఆత్మకూరుకు చెందిన కావటి ధర్మయ్య, వెంకట కృష్ణయ్య, చంద్ర, పూజారి అశోక్, శీనయ్య, చిన్నబ్బయ్య, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

నడివీధి పోలేరమ్మ జాతర



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

కావలి: పట్టణంలోని పాతూరు పోలేరమ్మ అరుగు వద్ద ఉన్న నడివీధి పోలేరమ్మ జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం శక్తి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. శక్తి అమ్మవారి లేతోటమ్మ గుడి వద్ద నుంచి బయలుదేరి గాలి గంగమ్మ గుడి వద్దకు చేరిన ఊరేగింపు, పూజలు అనంతరం పెద్దపవని బస్టాండ్ లో ఉన్న మండపం వద్దకు చేరుకుంది. అనంతరం శక్తి అమ్మవారిని ఊరేగింపుగా పాతూరులోని పోలేరమ్మ అరుగు వద్దకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో పట్టణంలోని భక్తులు, ప్రముఖులు పాల్గొన్నారు.

శివశంకర్ మాస్టర్‌కు పూర్ణకుంభ పురస్కారం



తెలుగు ప్రపంచ మహాసభలో మన్నెళ్లి శివశంకర్ మాస్టర్

మర్రిపాడు: రాజమహేంద్రవరంలో జరిగిన తెలుగు ప్రపంచ మహాసభలో నాలుగు డాక్టరేట్లు అందుకున్న మర్రిపాడు ఉపాధ్యాయుడు మన్నెళ్లి శివశంకర్ మాస్టర్‌కు పూర్ణకుంభ పురస్కారాన్ని అందజేశారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి కృష్ణమోహన్, తనికెళ్ల భరణి, గజల్ శ్రీనివాస్, చైతన్య సంస్థల అధినేత చైతన్యరాజు అందజేసినట్లు ఉపాధ్యాయుడు శివశంకర్ తెలిపారు. తనికెళ్ల భరణి తాను నిర్మించిన తెలుగుతల్లి, శ్రీవెంకటేశ్వరస్వామి దారపు శిల్పాలను అందరికీ చూపించి సభికుల ప్రశంసలు అందుకున్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు, అధికారులు

జలదంకి: మండలంలోని కమ్మవారిపాళెంలో పోలేరమ్మ ఆలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, పీఆర్ ఏఈ వాణి, సర్పంచ్ తమ్మినేని సతీష్‌నాయుడు భూమిపూజ నిర్వహించారు. పీఆర్ ఏఈ వాణి మాట్లాడుతూ కమ్మవారిపాళెం సచివాలయ పరిధిలో రూ. 40 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో రూ. 20 లక్షలతో ఏడు సిమెంట్ రోడ్లు, మరో రూ. 20 లక్షలతో డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సప్తపది శక్తిపీఠ పోలేరమ్మ తల్లి ఆలయ చైర్మన్ పరిమి నాయుడుబాబు, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, నాయకులు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, కోర్సిపాటి రామిరెడ్డి, సురె వెంకటశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి ప్రీమియర్ లీగ్

సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడులో ఈ నెల 11 నుంచి వీపీఆర్ ఆధ్వర్యంలో ఉప్పలపాడు ప్రీమియర్ లీగ్ 2024 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు కె శేఖర్, పీ సుబ్బారెడ్డి, దయాకర్, ఎం.శివ, సుమంత్, లహరీష్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్స్ మాట్లాడుతూ ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు అందజేస్తామన్నారు. అనంతసాగరం, కలువాయి, మర్రిపాడు మండలాల క్రికెట్ ప్లేయర్లు మాత్రమే టోర్నమెంట్లో పాల్గొనాలన్నారు. హార్డ్ టెన్నిస్ బంతితో టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం వసతి కల్పించనున్నామన్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు అందజేస్తామని, టోర్నమెంట్‌లో పాల్గొనదలిచిన వారు 10వ తేదీ లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 94936196 18, 9494866709, 7661005680 నంబర్లలో సంప్రదించాలని కోరారు.